సాక్షి
ప్రకాశం
శనివారం । 16 । నవంబర్ । 2024



జల్సాల కోసం దొంగతనాలు

ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగితీగలు చోరీ చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. రాగితీగలతో పాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 10లో..



ప్రైవేటు వ్యక్తులు..ఏజెన్సీలకు ఇసుక డిపోలు

ఇసుక డిపోలు నిర్వహించేందుకు కలెక్టర్ లాటరీ ద్వారా ఎంపిక చేశారు. - 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
30/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రామచంద్రారెడ్డి



భవనం రామచంద్రారెడ్డి

తర్లుపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తర్లుపాడుకు చెందిన భవనం రామచంద్రారెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అనుబంధ కమిటీల నియామకం, అనుబంధ విభాగ కార్యక్రమాల సమన్వయ బాధ్యతలు ఆయన నిర్వహిస్తారని పేర్కొంది.

17న మల్లవరంలో బ్రాహ్మణ కార్తీక సమారాధన

ఒంగోలు మెట్రో: మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో వెంకటేశ్వర స్వామి బ్రాహ్మణ అన్నదాన సత్రంలో ఈనెల 17వ తేదీ ఆదివారం బ్రాహ్మణ కార్తీక సమారాధన నిర్వహిస్తున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. 17వ తేదీ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు అల్పాహారం, తొమ్మిది గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కార్తీక దామోదర పూజ, 11 గంటలకు భక్తుల చేత సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బ్రాహ్మణ సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.

17న కాపు కార్తీక వన భోజనాలు

ఒంగోలు వన్‌టౌన్: కాపు కార్తీక వనభోజనాలు ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కే సంజీవకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలులోని కాపు సంఘ కార్యాలయంలో శుక్రవారం కార్తీక వనభోజన మహోత్సవ ఆహ్వాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఒంగోలులోని డి6 ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీ శ్రీనివాసమూర్తి, యు శ్రీనివాసరావు, కే నారాయణ, పీ ఫణీంద్ర కుమార్, బీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని, చదువును కొనసాగిస్తూనే క్రీడల్లో కూడా ప్రతిభ చూపించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పుల్లలచెరువు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థిని బి.వెంకటమ్మకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బహుమతితో రూ.5 వేల నగదు అందజేశారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశం మీద బి.వెంకటమ్మ ఆలోచనాత్మక సూచనలు చేసినట్లు కొనియాడిన ఎస్పీ ఆమె చదువు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలనధిరోహించే లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్టాఫ్ నర్స్ బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

తప్పించుకున్నారా.. తప్పించారా ?

- ముగ్గురు నిందితులు పారిపోయారని చేస్తున్న ప్రచారంలో నిజమెంత ?

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పోలీసుల కస్టడీ నుంచి ముగ్గురు నిందితులు తప్పించుకొని పరారవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఇటీవల మోటారు బైకుల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిఘా పెట్టారు. గత సోమవారం నలుగురు నిందితులు పోలీసులకు చిక్కారు. అయితే బుధవారం పోలీసుల కస్టడీ నుంచి కౌశిక్, శివ, రఫి అనే ముగ్గురు నిందితులు పరారయ్యారు. మరొక నిందితుడిని వెంటపడి పోలీసులు పట్టుకున్నట్లు చెబుతున్నారు. ఒకేసారి ముగ్గురు నిందితులు పోలీసుల కస్టడీ నుంచి పరారవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలులో తాలూకా, రూరల్, వన్‌టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. నిందితులను ఈ నాలుగు స్టేషన్లలో ఎక్కడైనా ఉంచి విచారణ చేయవచ్చు. కానీ డీఎస్పీ ఆఫీసులో ఆవరణలో శిథిలమైన పోలీసు క్వార్టర్స్‌లోని ఒక గదిలో నిందితులను ఉంచినట్లు సమాచారం. వారికి కాపలాగా ఇద్దరు కానిస్టేబుళ్లను కేటాయించారు. నిందితుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆ శాఖకు చెందిన కొందరు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణ సమయంలో నిందితులు చేతికి వేసిన సంకెళ్లను తీసుకొని పారిపోయారని పోలీసులు చెప్పడం నమ్మశక్యంగా లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నలుగురు నిందితులు చేతికి వేసిన సంకెళ్లు తీసుకుంటుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. నిజానికి నిందితులను ఉద్దేశపూర్వకంగానే వదిలి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. లోతుగా విచారణ జరిపితే ఈ ఘటన వెనక ఉన్న పోలీసుల పాత్ర బయటకు వస్తుంది.

కార్తీక వెలుగులు

కొత్తపట్నం సముద్రతీరంలో సముద్రస్నానం చేసేందుకు పోటెత్తిన భక్తులు





కొత్తపట్నం సముద్ర తీరంలో సైకత శివలింగాలకు పూజలు చేస్తున్న మహిళలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు భక్తులు పోటెత్తారు. కొత్తపట్నం సముద్ర తీరానికి వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తీరంలో సైకత శివలింగాలను తీర్చిదిద్ది పూజలు చేశారు. రాత్రికి ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున వచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. జ్వాలా తోరణాలు ఆకట్టుకున్నాయి.

- సాక్షి, ఒంగోలు



ఒంగోలులోని కొండ మీద వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

ఉచితం ఉత్తిదే

ఉచిత ఇసుక ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం లోడింగ్, రవాణా చార్జీల పేరుతో పెనుభారం మోపుతోంది. మద్యం వ్యాపారం తరహాలోనే ఇసుక వ్యాపారాన్ని తెలుగు తమ్ముళ్లకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇసుక స్టాక్ పాయింట్లకు లైసెన్సుల మంజూరు పేరుతో ఇసుక దందాకు తెరతీశారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో స్టాక్ పాయింట్ల నుంచే ఇసుక తరలించుకోవాలి. లారీ ఇసుక కావాలంటే జిల్లా పశ్చిమ ప్రాంతంలో రూ.27 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. అంత ఇచ్చేందుకు సిద్ధమైనా నో స్టాక్ బోర్డులు పెట్టి ఇసుక కోసం టీడీపీ నేతల ఇళ్ల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇసుక కొరతతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఉసూరుమంటున్నారు.

- అటకెక్కిన ఉచిత ఇసుక హామీ
- లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.27 వేలు
- ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల నుంచి రూ.6 వేలు
- రవాణా ఖర్చులు అదనం
- అయినా సరే నో స్టాక్
- పనులు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు
- కొత్తగా స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు లైసెన్సులు జారీ
- అధికారికంగా తమ్ముళ్లకు ఇసుక దందా అప్పగింత



ఒంగోలులోని ఇసుక స్టాక్ పాయింట్

స్టాక్ యార్డు ప్రదేశం	నిర్ణయించిన ధరలు (టన్నుకు రూపాయల్లో)
ఒంగోలు	980
గిద్దలూరు	1200
మార్కాపురం	1280
యర్రగొండపాలెం	1500
కనిగిరి	980
దర్శి	1230

ఉచిత ఇసుకకు ధరల నిర్ణయం

ఇసుక ఉచితం అంటూనే రాష్ట్ర ప్రభుత్వం లోడింగ్ చార్జీల పేరుతో ధరలు నిర్ణయించింది. జీవోఎంఎస్ 66, 25.10.2024 ప్రకారం ఉచిత ఇసుక విధానం–2024కు సంబంధించి విధి విధానాలను ప్రకటించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇప్పటి వరకు ఇసుక రీచ్‌ల వద్ద వసూలు చేస్తున్న సీనరేజీ, డీఎంఎఫ్, మెరిట్ రుసుములను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అదే ఉత్తర్వుల్లో ప్రకాశం జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున సాధారణ ఇసుక వినియోగదారులు సరిహద్దు జిల్లాల ఇసుక రీచ్‌ల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జిలను చెల్లించి కావలసినంత ఇసుక కొనుక్కోవాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ఇలా ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిందే తడవుగా ఇసుక దందా మొదలుపెట్టారు. ఒకవైపు ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే మరోవైపు తెలుగు తమ్ముళ్లు ఇసుక స్టాక్ పాయింట్లను తమ స్వాధీనంలోకి తీసుకొని రాత్రికి రాత్రే తరలించుకొనిపోయారు. రోజుల వ్యవధిలోనే స్టాక్ మొత్తం తరలించేసి ఉత్త చేతులు చూపారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక అందజేస్తున్నామని చెబుతూ ప్రజల కళ్లకు గంతలు కడుతున్నారు. మరోవైపు టన్ను రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. ఇసుక ఉచితమే.. లోడింగ్ చార్జీలు మాత్రమే చెల్లించమంటున్నామంటూ కబుర్లు చెబుతున్నారు. ఈ నాటకాలు చూసిన ప్రజలు కడుపు మండి ఇదేం టన్యాయం అని ప్రశ్నిస్తే సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని అవమానిస్తున్నారంటూ పోలీసులను ఉసి గొలిపి కేసులు బనాయిస్తున్నారు. ఇప్పుడు తాజాగా రాష్ట్ర కూటమి పాలకులు కొత్త ఎత్తుగడ వేశారు. మద్యం వ్యాపారం తరహాలో ఇసుక వ్యాపారాన్ని కూడా తెలుగు తమ్ముళ్లకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇసుక స్టాక్ పాయింట్లకు లైసెన్సుల మంజూరు పేరుతో ఇసుక దందాకు తెరదీశారు.

లారీ ఇసుక రూ.17,640

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరల ప్రకారం ఒక లారీ ఇసుక ఒంగోలులో రూ.17,640 పెట్టి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అదే గిద్దలూరులో అయితే రూ.21,600, మార్కాపురం రూ.23,040, యర్రగొండపాలెం రూ.27 వేలు, కనిగిరి రూ.17,640, దర్శి రూ.22,140 అవుతుంది. ఈ లెక్కన ట్రాక్టర్ ఇసుక ఒంగోలు రూ.3,920, గిద్దలూరు రూ.4,800, మార్కాపురం రూ.5,120, యర్రగొండపాలెం రూ.6 వేలు, కనిగిరి రూ.3,920, దర్శి రూ.4,920 అవుతుంది. ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలకు విక్రయిస్తేనే. స్టాక్ పాయింట్ సమీపంలో ఉన్న వినియోగదారుడి కంటే మారుమూల ప్రాంతాల్లో ఉన్న వినియోగదారుడిపై రవాణా ఖర్చులు అదనంగా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పడతాయి. అంటే టన్ను ధర కనీసం రూ.1500 వరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వేలకు వేలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసే ఇసుక ఉచితం ఎలా అవుతుందో పాలకులే చెప్పాలి.

అయినా సరే నో స్టాక్

వేలాది రూపాయల ఖరీదు చేసే ఉచిత ఇసుక కొనాలంటే అందరికీ దొరికే పరిస్థితి లేదు. తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు రికమెండ్ చేసిన వారికి, కూటమి శ్రేణులకు మాత్రమే ఇసుక లభిస్తుంది. మిగిలిన సామాన్య ప్రజలు, భవన నిర్మాణ కార్మికులకు ఇసుక అందని ద్రాక్షలా తయారైంది. ఆన్‌లైన్లో బుక్ చేసుకున్నా ఇసుక నో స్టాక్ అని చూపుతుంది. దాంతో ఇసుక కోసం తెలుగుదేశం నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇసుక వ్యాపారం వారి చేతుల్లో ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని మండిపడుతున్నారు.

రోడ్డున పడిన భవన నిర్మాణ కార్మికులు:

ఇసుక కొరత, ధరలు పెరిగిపోవడంతో భవన నిర్మాణాలను వాయిదా వేసుకున్నారు. దాంతో పనులు లేక వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. జిల్లాలో సుమారు 1.51 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక దొరకడం గగనమైపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో 5 నెలలుగా జిల్లాలో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వ భవనాల పనులు కూడా జరగడం లేదు. దీంతో భవన నిర్మాణాలపై పెనుభారం పడింది. కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలనుకున్నవారు కూడా ఈ పరిస్థితి చూసి వెనకంజ వేశారు. వేలాది మంది భవన నిర్మాణ కార్మికులకు చేతిలో పనులు లేక రోడ్డున పడ్డారు. ఇళ్లు గడవడం కష్టమై కుటుంబాలు పస్తులతో గడుపుతున్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నా పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

మద్యం తరహాలో లైసెన్సుల జారీ

తెలుగుదేశం నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇసుక వ్యాపారాన్ని కూడా మద్యం వ్యాపారం తరహాలో అధికారికంగా టీడీపీ నాయకులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. ఉచిత ఇసుక విధానం- 2024 ప్రకారం జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున ఇసుక డిపోలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇసుక డిపోల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులు, ఏజెన్సీలకు అప్పగించనుంది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాలోని ఒంగోలు నుంచి 12, మార్కాపురం నుంచి 8, గిద్దలూరు నుంచి 2, యర్రగొండపాలెం నుంచి 3, కనిగిరి నుంచి 3, దర్శి నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేశారు. ఈ ప్రక్రియంతా అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లో జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యేలు ఎంపిక చేసిన వారి చేతనే దరఖాస్తు చేయించినట్లు తెలుస్తోంది. దీంతో వ్యూహాత్మకంగా ఇసుక వ్యాపారాన్ని తెలుగుదేశం ప్రజా ప్రతినిధుల చేతికి అప్పగించడం పూర్తయినట్లేనని చెప్పవచ్చు.

ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలకు అమ్ముతున్నారు



ఇసుక ధరలు తగ్గకపోవడం, సరిపడా ఇసుక అందుబాటులో లేకపోవడంతో బేల్దారి పనులు లేవు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల వరకు అమ్ముతున్నారు. దీంతో ఇంటి నిర్మాణాలు చేసుకునేవారు ధరలు తగ్గాక పనులు మొదలు పెట్టుకుందామని పనులు వాయిదా వేసుకుంటున్నారు. పనులు దొరక్కపోవడంతో ఆటో నడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇసుక ధరలు తగ్గించి ప్రజలకు అవసరమైన మేర ఇసుకను అందించేలా చర్యలు తీసుకోవాలి.

– నందిపాటి అచ్చయ్య, బేల్దార్ మేస్త్రి, కంభం

ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక ఇవ్వాలి



తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 5 నెలలు గడుస్తున్నాయి. ఇప్పటి వరకు ఉచిత ఇసుక అడ్రస్ లేదు. గతంలో కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ట్రక్కు ఇసుక రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు అవుతోంది. దీంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో మధ్య తరగతి ప్రజలు నిర్మించుకోవడం అసాధ్యమవుతుంది. అంతేకాకుండా భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇసుక ఉచితంగా పంపిణీ చేయాలి.

– జి.శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఒంగోలు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పరుచూరివారిపాలెంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్

పొన్నలూరు: గ్రామాల్లో పేద ప్రజలు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని త్వరితగతిన పూర్తి స్థాయిలో నిర్మించేలా చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండలంలోని పరుచూరివారిపాలెంలో గృహ నిర్మాణాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై ప్రతి రోజూ గృహ నిర్మాణశాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళా లబ్ధిదారులకు రూ.35 వేలు డ్వాక్రా రుణం మజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో లేని మహిళలను కొత్తగా గ్రూపు తయారు చేసి ఆ తరువాత రుణం మంజూరు చేయించాలన్నారు. ముఖ్యంగా కాలనీలో రోడ్లు, సైడు కాలువలు, విద్యుత్ సౌకర్యం, తాగు నీరు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోజూ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై నివేదిక సమర్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, హౌసింగ్ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ సుజాత పాల్గొన్నారు.



పరచూరివారిపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం

పొన్నలూరు: కొండపి నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమైన సంగమేశ్వర ప్రాజెక్టు పనులను సాధ్యమైనంత వరకు త్వరలోనే ప్రారంభిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మండలంలోని సంగమేశ్వరం ప్రాజెక్టును శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మ్యాప్‌తో పాటు నిర్మాణ ప్రాంతాన్ని ఇప్పటి వరకు జరిగిన పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిలిచిపోయిన సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పునఃప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న ధరలు ప్రకారం నిధుల అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సాధ్యమైనంత త్వరగా సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ కరిముల్లా, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ సుజాత పాల్గొన్నారు.

ఒంగోలు వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా రవిబాబు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొకే అందజేసి అభినందనలు తెలుపుతున్న చుండూరి రవిబాబు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా చుండూరి రవిబాబును నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చుండూరి రవిబాబు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి శాలువతో సన్మానించి, బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చుండూరి రవిబాబు మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతానన్నారు.

క్లుప్తంగా

భారీ వర్షానికి కుప్పకూలిన పెంకుటిల్లు

● సుమారు రూ.2 లక్షల నష్టం



కొత్తపట్నం: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఓ పెంకుటిల్లు కుప్పకూలిన సంఘటన కొత్తపట్నంలోని ఆయుర్వేద హాస్పిటల్ సమీపంలో చోటుచేసుకుంది. బుర్రా సరస్వతి కుటుంబం నివాసం ఉంటున్న పెంకుటిల్లు కారుతుండటంతో వేరే ఇంటికి మారారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి పెంకిటిల్లు కుప్పకూలింది. దీంతో సుమారు రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఒకవేళ వారు ఇల్లు మారకుండా అక్కడే ఉండి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేది. అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని బాధితురాలు సరస్వతి విజ్ఞప్తి చేశారు.

19న పొదిలిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: ఈనెల 19న పొదిలిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 20వ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయిస్వామి కోరారు. శుక్రవారం స్థానిక వేమన మహిళ డిగ్రీ కళాశాలలో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఎన్నికలలో కుటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజి, యూసఫ్, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



మహిళ మృతదేహం

ఒంగోలు టౌన్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సింగరాయకొండ నుంచి ఉలవపాడు రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైనులో వేగంగా వెళుతున్న రైలు నుంచి గుర్తు తెలియని ఒక మహిళ జారి పడి మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. మృతురాలికి 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఎరుపు రంగు జాకెట్, ఎరుపు పసుపు రంగు కలిసిన చీర ధరించి ఉంది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. సమాచారం తెలిసిన వారు 9440627647కు ఫోన్ ద్వారా సంప్రదించాల్సిందిగా రైల్వే ఎస్ఐ టి.అరుణ కుమారి తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

ఒంగోలు టౌన్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న రైలుకిందపడి సూరారెడ్డిపాలెం సమీపంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. ఎరుపు రంగు కట్ బనియన్, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి ఎడమ చేతి మీద సురేఖ అని పచ్చబొట్టు ఉంది. ఎడమ చెవికి పోగు ఉందని, మృతుడి వివరాలు తెలిసిన వారు ఒంగోలు రైల్వే పోలీసులకు, 9440627647 నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్ఐ టి.అరుణకుమారి తెలిపారు.

'బయోగ్యాస్' భూముల పరిశీలన



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ

కొనకనమిట్ల: రిలయన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ కంపెనీకి మండలంలో అనువైన ప్రభుత్వ భూమిని గుర్తిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇరసలగుండం, పెదారికట్ల, కొనకనమిట్ల ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను రిలయన్స్ బృందంతో కలిసి పరిశీలించారు. భూముల మ్యాపులను రిలయన్స్ బృందానికి చూపించి వారితో చర్చించారు. జేసీ వెంట తహసీల్దార్ ఆవుల సురేష్, ఆర్ఐ మహదేవరెడ్డి, వీఆర్ఓ దిలీప్ కుమార్, సర్వేయర్ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.



సూర్యుడికి దీపార్చన చేస్తున్న యువతి

▼ సముద్రస్నానమాచరిస్తున్న భక్తులు







ఒంగోలు : శేషవాహనంపై నగరోత్సవంలో కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వరస్వామివారు, దర్శించుకుంటున్న భక్తులు

శివం..శివం

భక్తిభావం వెల్లివిరిసింది. శివనామస్మరణ మార్మోగింది. జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తుల సముద్ర స్నానాలతో కొత్తపట్నం, ఇతర తీరప్రాంతాలు కిటకిటలాడాయి. వేకువజామునే సముద్ర తీరాలకు భక్తులు చేరుకున్నారు. ఇసుకతో శివలింగాలు చేసి విశేషంగా అలంకరించారు. కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసాయి. శివారాధన, కార్తీక దీపారాధనతో వెలుగులు విరజిమ్మాయి. జ్వాలాతోరణం వేడుకలు వైభవంగా జరిగాయి. భైరవకోన, జమ్ములపాలెం, తదితర పుణ్యక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు.

– సాక్షి, ఒంగోలు



సంతనూతలపాడులో ప్రత్యేక అలంకరణలో త్రిపురాంతకస్వామి



పొదిలి నిర్మమహేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాలాతోరణం వెలిగిస్తున్న భక్తులు



జమ్ములపాలెంలో 1116 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



ప్రసన్నచెన్నకేశవస్వామి ఆలయంలో తులసి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఇసుకతో శివలింగం తయారు చేసి పూజలు చేస్తున్న మాలధారులు



ఒంగోలు : కొత్తపట్నం బస్టాండ్ వద్ద రాజరాజేశ్వరస్వామి ఆలయంలో..



కనిగిరిలోని సాయిబాబా దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు



పామూరు భుజంగేశ్వర ఆలయంలో క్యూ..



తీరంలో సైకత లింగంతో భక్తుల సెల్ఫీ..

ప్రేమ మధురం.. ప్రియుడే కఠినం!

- కర్నాటక యువతితో చిన్నారికట్ల యువకుడి సహజీవనం
- మోజు తీరడంతో రెండు నెలల క్రితం వదిలేసి వెళ్లిన వైనం
- న్యాయం చేయాలని పోలీసుల చుట్టూ యువతి ప్రదక్షిణ
- ఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం
- చివరికి జీజీహెచ్ మార్చురీలో అనాథ శవంగా పడి ఉన్న యశోద

ఒంగోలు టౌన్: ప్రియుడు మోసగించాడన్న మనస్తాపంతో ప్రకాశం జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన యశోద (25) శుక్రవారం ఉదయం మృతి చెందింది. కర్ణాటకకు చెందిన యశోద చౌహాన్ పొదిలి మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన మట్టయ్యతో ప్రేమలో పడింది. రెండేళ్లుగా ఒంగోలులోని సమతా నగర్‌లో అతడితో సహజీవనం చేస్తోంది. రెండు నెలల క్రితం మట్టయ్య ఆమెను వదిలి వెళ్లాడు. న్యాయం చేయమంటూ పోలీసుల చుట్టూ తిరిగింది. మొదట మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో ఎస్పీని ఆశ్రయించింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి వేడుకొంది. ఆయన తాలూకా పోలీసు స్టేషన్‌కు రిఫర్ చేశారు. తాలూకా పోలీసు స్టేషన్లో ఆమెను ఎవరూ పట్టించుకోలేదు. తిరిగి తిరిగి అలసిపోయింది. అయినా ఆమెకు న్యాయం జరగలేదు. పోలీసులు నిర్లక్ష్యం వహించారు. దాంతో తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం కోల్పోయిన యశోద గత సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయం బయట ఒంటి మీద పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించడం తెలిసిందే. 90 శాతం గాయాలపాలైన ఆమెను జీజీహెచ్‌కు తరలించి వైద్యం చేస్తున్నారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం విషమంగానే ఉంది. యశోద ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని కర్ణాటకలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు పోలీసులు తెలియజేశారు. తొలుత ఒంగోలుకు రావడానికి తిరస్కరించిన వారు ఆ తరువాత ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆమెను చూసి వెళ్లారు. ఇప్పుడు యశోద ఒక అనాథ మృతదేహంగా మార్చురీలో పడి వుంది. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, దార అంజయ్య, చేబ్రోలు సుజన్ రాజ్, గంటా సుబ్బారావుల సమక్షంలో శవ పంచనామా జరిపించారు. శనివారం ఉదయం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టయ్యను అరెస్టు చేయాలి:

కర్ణాటక యువతి యశోదను ప్రేమ పేరుతో వంచించి చివరికి ఆమె ఆత్మహత్యకు కారణమైన మట్టయ్యను వెంటనే అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మట్టయ్యపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. యశోద ఆత్మహత్యకు పాల్పడి ఆరు రోజులైనప్పటికీ మట్టయ్యను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

జల్సాల కోసం దొంగతనాలు

- ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగి తీగలు చోరీ చేస్తున్న దొంగల అరెస్ట్
- రాగి తీగలతో పాటు గంజాయి స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: వారు ముగ్గురూ స్నేహితులు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించడానికి దొంగలుగా మారారు. ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వాటిలోని రాగితీగలు అపహరించారు. అప్పుడప్పుడూ గంజాయి కూడా విక్రయించారు. ఈ ముగ్గురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆ వివరాలు వెల్లడించారు. తాళ్లూరు మండలంలోని సోమవరప్పాడు పాములకాలనీకి చెందిన పోలా జాన్సన్, దర్శిలోని చౌటుపాలెం రోడ్డుకు చెందిన కుంచాల లింగేష్, నెల్లూరు జిల్లా లింగసముద్రంకు చెందిన గురునాథం లాజర్ మంచి స్నేహితులు. జల్సాలు, జూదాలకు అలవాటు పడిపోయారు. సులభంగా సంపాదించేందుకు దొంగలుగా మారారు. ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగితీగను దొంగలించడం మొదలుపెట్టారు. పోలా జాన్సన్ గతంలో 13 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించిన కేసులో నిందితునిగా ఉన్నాడు. దొంగిలించిన రాగితీగలలో కొంత గురునాథం లాజరుకు, మరికొంత ఇతరులకు విక్రయించేవారు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. ఈ ముగ్గురు కలిసి పల్నాడు జిల్లా వినుకొండ రైల్వేస్టేషన్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేశారు. దాన్ని దర్శి ప్రాంతంలో విక్రయించేందుకు కురిచేడు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఊరిలోకి వస్తుండగా పక్కా సమాచారంతో త్రిపురాంతకం సీఐ అసన్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి 1.5 కిలోల గంజాయి, 16 కేజీల రాగి తీగ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన త్రిపురాంతకం సీఐ అసన్, తాళ్లూరు ఎస్సై మల్లికార్జున, ఏఎస్ఐ మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లు విగ్నేష్, నారాయణరెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు పాల్గొన్నారు.

బైకుల దొంగలు అరెస్ట్...

☛ 12 లక్షల విలువైన 17 బైకులు స్వాధీనం

జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో బైకులు దొంగలించిన కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆ వివరాలు వెల్లడించారు. ఇటీవల దర్శి ప్రాంతంలో బైకుల దొంగతనాలు ఎక్కువ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దర్శి సీఐ రామారావు, సిబ్బందితో కలిసి శుక్రవారం పోతవరం గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు బైకుల మీద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా, వారి వద్ద ఉన్న బైకులు దర్శి పోలీసుస్టేషన్ పరిధిలో దొంగలించబడినవిగా గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో దర్శి మండలం గంగపాలెం గ్రామానికి చెందిన అంకాల శ్రీను, అదే గ్రామానికి చెందిన కప్పల వపన్, కప్పల భవానీ, బండారు శ్రీహరి, దర్శి మండలంలో దేవవరం గ్రామానికి చెందిన గుంజ గోపిలను అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లాతో పాటుగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో బైకులు దొంగతనం చేసినట్లు వారు అంగీకరించారు. దర్శి ప్రాంతంలో 7 మోటారు బైకులు, కనిగిరి, పొదిలి ప్రాంతాలతో పాటు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10 బైకులను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. చోరీ చేసిన బైకులను దేవవరం గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ గుంజ గోపికి విక్రయించినట్లు తెలిపారు. దాంతో మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. గోపి వద్ద ఉన్న 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి, ఏఎస్ఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్, కానిస్టేబుళ్లు మహేష్, గిరిలను ఎస్పీ అభినందించారు.

విద్యారంగ కాషాయీకరణ తగదు



నూతన కమిటీతో నాయకులు

మార్కాపురం: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యారంగ కషాయీకరణ, ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటించాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు యూ.గనిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పీడీఎస్‌యూ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న 950 యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో అశాస్త్రీయ భావజాలాన్ని విద్యార్థుల మెదడులోకి పంపుతోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం, జీడీపీలో 6 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని కోరారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం యువత, ప్రజలు ఉద్యమించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలైనా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. తల్లికి వందనం, ఫీజు రీఎంబర్సుమెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మార్కాపురంలో డిగ్రీ కాలేజిని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నూతన డివిజన్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కార్యదర్శిగా జయపాల్ సహా 13 మందితో కూడిన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎ.సజీవరాజు, కె.నాగరాజు, షాహిద్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఫారెస్ట్ డీడీ



డీడీ నిషాకుమారిని అభినందిస్తున్న ఉద్యోగ సంఘు నాయకులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నిషాకుమారి శుక్రవారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళంలో డీఎఫ్ఓగా పనిచేస్తున్న ఆమెను గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను అటవీశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపవరం రంగారెడ్డి, ఉపాధ్యక్ష కార్యదర్శులు చాంద్‌బాషా, చేజర్లయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ శ్రీకాంత్‌రెడ్డి, గిద్దలూరు రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ డి.నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి



మృతి చెందిన వెంకటయ్య

కొమరోలు: విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన కొమరోలు మండలంలోని మొట్టుపల్లె గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మొట్టుపల్లె గ్రామానికి చెందిన శీరబోయిన వెంకటయ్య(46) రోజులాగే గురువారం తన గొర్రెలను మేపడానికి పొలానికి వెళ్లాడు. గురువారం సాయంత్రం వర్షం పడుతుండగా అక్కడే చెట్టు కిందకు చేరాడు. డీప్ బోర్ స్టార్టర్ నుంచి విద్యుత్ ఎర్త్ కావడంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం రాత్రి పొద్దుపోయాక కూడా వెంకటయ్య ఇంటికి చేరకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనతో గాలించగా.. చెట్టు కింద నిర్జీవంగా పడి ఉన్నాడు. మృతునికి భార్య గురవమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హైవేపై కార్లు, లారీలు ఢీ

- ఒకే ప్రదేశంలో వరుసగా రెండు ప్రమాదాలు
- ఒకరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు



మృతుడు శ్రీనివాసులు(ఫైల్)

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై ఒకే ప్రదేశంలో శుక్రవారం రెండు ప్రమాదాలు సంభవించాయి. త్రిపురాంతకం మండలం రాజుపాలెం సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనల్లో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నర్సరావుపేటకు చెందిన అమర్నాథ్, శంకరరావు, రాజేశ్వరి, సుధ కారులో శ్రీశైలం వెళ్తున్నారు. వీరి కారు, రాజుపాలెం వద్ద ఎదురుగా వస్తున్న సత్యసాయి జిల్లాకు చెందిన జయసింహ కారు ఢీకొన్నాయి. అటుగా వెళ్తున్న లారీ డ్రైవర్ గమనించి కారులో ఇరుక్కుపోయిన నలుగురిని కాపాడేందుకు ఆగాడు. అయితే ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో ట్రక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రక్ యజమాని, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన తలారి శ్రీనివాసులు(32) మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై శివ బసవరాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.



హైవేపై నుజ్జునుజ్జయిన కార్లు



లారీని ఢీకొట్టిన మరో ట్రక్

ప్రైవేటు వ్యక్తులు, ఏజెన్సీలకు ఇసుక డిపోలు

● లాటరీ ద్వారా ఎంపిక చేసిన కలెక్టర్



ఇసుక డిపోలు నడిపేందుదు దరఖాస్తులను లాటరీ తీస్తున్న కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందుకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇసుక డిపోలు నిర్వహించేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో లాటరీ ద్వారా శుక్రవారం ప్రైవేటు వ్యక్తులు, ఏజెన్సీలను ఎంపిక చేశారు. ఇసుక స్టాక్ యార్డులు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులు, ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా 30 వచ్చాయి. వాటిలో 13 దరఖాస్తులను ఎంపిక చేశారు. ఒంగోలు యార్డు కోసం 6 దరఖాస్తులను ఎంపిక చేయగా, యర్రగొండపాలెంకు 3, కనిగిరి, దర్శి, గిద్దలూరు, మార్కాపురంకు ఒక్కొక్కటి చొప్పున అర్హత పొందాయి. లాటరీలో ఎంపికైన వారు ఇసుక డిపోలను సిద్ధం చేసి ప్రజలకు సాధారణ ఇసుకను ఉత్తర్వుల మేరకు సరఫరా చేయాలని సూచించారు. లాటరీ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

వెటరన్ టెన్నిస్‌లో కోటయ్య గౌడ్ సత్తా



టెన్నిస్‌లో ప్రతిభ చాటిన కోటయ్యగౌడ్, ఇతర క్రీడాకారులు

గిద్దలూరు రూరల్: పాలకొల్లులో ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ నేషనల్ టోర్నమెంట్‌లో 65 ప్లస్ క్వాలిఫైడ్‌లో గిద్దలూరుకు చెందిన కంచర్ల కోటయ్యగౌడ్ సత్తా చాటారు. విశాఖపట్నం వాసి శశిభూషణ్‌తో కలిసి కోటయ్యగౌడ్ డబుల్స్‌లో టీవీ రావు, కృష్ణారెడ్డి మీద గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయనను టెన్నిస్ క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందించారు.